ప్రజాశక్తి
బుధవారం 07 ఫిబ్రవరి 2024 5
కర్నూలు

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

ఈసారైనా ఇస్తారా..?

- జిల్లా ప్రాజెక్టులకు దక్కని నిధులు - ముందుకు కదలని నీటి పథకాలు
- ఈ బడ్జెట్‌పై జిల్లా వాసుల ఆశలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు ముందుకు కదలడం లేదు. గత కొన్నేళ్లుగా రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలోని ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకపోవడంతో ఏ ప్రాజెక్టూ ముందుకు సాగడం లేదు. చాలా ప్రాజెక్టులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. బుధవారం రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఈ సారైనా జిల్లా ప్రాజెక్టులకు నిధులు ఇస్తారా..? లేదా..? అని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు....

గతేడాది రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. రాయలసీమకు ఆధారంగా ఉన్న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధికి ఎటువంటి కేటాయింపులూ చేయలేదు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల అంచనాలను పక్కనబెట్టి మొక్కుబడిగా నిధులు కేటాయించారు.

గతి లేని గుండ్రేవుల

కర్నూలు, కడప జిల్లాలకు మేలు కలిగిలే రూపొందించిన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన చర్యలేవీ ఇప్పటి వరకూ మొదలు కాలేదు. కర్నూలు జిల్లా సుంకేసుల దగ్గర తుంగభద్ర నదిపై 1.20 టిఎంసిల సామర్థ్యంతో 1865లో అప్పటి పాలకులు సుంకేసుల జలాశయాన్ని నిర్మించారు. ఈ బ్యారేజీకి అనుసంధానంగా కర్నూలు-కడప (కెసి) కాలువ నిర్మించారు. జల రవాణా కోసం నిర్మించిన కాలువను స్వాతంత్ర్యం అనంతరం సాగునీటి కాలువగా మార్చారు. కృష్ణా వాటర్ డిస్‌ప్యూట్ ట్రిబ్యునల్ 31.90 టిఎంసిల నీటి వాటాను కేటాయించింది. దీని పరిధిలో కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. సుంకేసుల సామర్థ్యం తక్కువ కావడంతో తుంగభద్రకు వరద వస్తేనే కాలువకు సాగునీరు అందుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు సాగునీటి నిపుణులు, విశ్రాంత ఇంజినీర్ సుబ్బరాయుడు సుంకేసుల రిజర్వాయర్ ఎగువన గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి రూపకల్పన చేశారు. కర్నూలు జిల్లాలోని సి.బెళగల్, నందవరం, తెలంగాణలోని రాజోలు ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గుండ్రేవుల జలాశయం నిర్మాణం జరిగితే 20 టిఎంసిలు నిల్వ చేయనున్నారు. వరద లేని సమయంలోనూ ఈ నీటిని వాడుకోవచ్చు. గుండ్రేవులకు సంబంధించి గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా శ్రద్ధ పెట్టడం లేదు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రవేశపెట్టిన నాలుగు బడ్జెట్లలోనూ గుండ్రేవులకు నిధులు కేటాయించకపోవడంతో జిల్లా ప్రజల ఆశలు అడియాశలయ్యాయి.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు

కరువుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హోసళ్లి, సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి. పథకం ప్రారంభంలో వేసిన గొట్టాలు దెబ్బతిన్నాయి. ఒక్కో ఎత్తిపోతల కింద 500 నుంచి 600 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులకు నిధులు వెచ్చించి పునరుద్ధరిస్తే తామే వాటిని కొనసాగించుకుంటామని రైతులు వేడుకుంటున్నా పట్టించుకొనేవారు కరువయ్యారు.

వలస నివారణ చర్యలు శూన్యం

ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊళ్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేత పట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హోళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబయికి తరలివెళ్లారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 40వేల మందికి పైగా వలస వెళ్లారు. వలస నివారణకు చర్యలు చేపట్టే అంశాన్ని ఇప్పటి వరకూ ఏ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు.

పెన్షన్ నెలకు రూ.9 వేలు ఇవ్వాలి

- కర్నూలు ఇపిఎఫ్ ఆఫీసు ముందు పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కర్నూలు నగరంలో ఈపీఎఫ్ ఆఫీసు ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ముందు గా అశోక్ నగర్ సెంటర్ నుండి ఇపిఎఫ్ ఆఫీసు వరకు ర్యాలీగా వచ్చి ధర్నా చేశారు. ధర్నాలో పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కనీస పెన్షన్ నెలకు రూ.9వేలు ఇవ్వాలని ,ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని, హయ్యర్ పెన్షన్ ఆప్షన్ అందరికీ వర్తింపజేయాలని, రైల్వే చార్జీలలో రాయితీ కల్పించాలని, ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. ఈ ధర్నాకు సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.సుధాకరప్ప, సిఐటియు జిల్లా నాయకులు కె.ప్రభాకర్, మద్దిలేటి మాట్లాడుతూ వివిధ పారిశ్రామిక వాడలలో పని చేస్తూ పెన్షన్ పొందుతున్న వారు దేశంలో రూ.75 లక్షల మంది, రాష్ట్రంలో రూ.లక్ష యాభై వేల మంది ఉన్నారని తెలిపారు. కర్నూలు నగరంలో బిఎస్ఎన్ఎల్ ,పేపర్ మిల్లు, గ్లాస్ ఫ్యాక్టరీ, పాలడైరీ, బిర్లా కంపెనీ, ఆర్టీసీ కార్బైడ్, ఎంజీ బ్రదర్స్ తదితర సంస్థలలో 20నుంచి 30 సంవత్సరాలుగా పనిచేస్తూ రిటైర్డ్ అయిన తరువాత వచ్చే పెన్షన్ రూ.వేయ్యి లోపు ఉందని, ఈ పెన్షన్ తో ఎలా బతకాలని వారు ప్రశ్నించారు. గత ఎన్నికల్లో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక కనీస పెన్షన్ రూ.3 వేలు ఇస్తామని వాగ్దానం చేసి 10 సంవత్సరాలు అవుతోందని తెలిపారు. గత సంవత్సర కాలంగా కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని అనేక రూపాలలో ఆందోళనలు చేసినా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చలనం లేకుండా పోయిందని విమర్శించారు. ప్రస్తుతం సామాజిక పెన్షన్ రూ.3000 ఇస్తున్నారని 20నుంచి 30 సంవత్సరాలుగా పనిచేస్తూ జమచేసిన ఇపిఎఫ్ రూ.వేలకోట్లు ప్రభుత్వం దగ్గర ఉన్నా పెన్షన్ పెంచడానికి ప్రభుత్వానికి చేతులు రావడంలేదని తెలిపారు. వచ్చే వెయ్యి రూపాయల పెన్షన్ వైద్య ఖర్చులకు కూడా సరిపోవడం లేదన్నారు. ధరల పెరుగుదలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు తీసుకుని వచ్చి కనీస పెన్షన్ నెలకురూ.9వేలు ఇవ్వాలన్నారు. లేదంటే రాబోయే ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. జె.శంకర్రావు, మద్దిలేటి, నాగగోపాల్, కెవి. మురళీమోహన్‌రావు, వెంకటేశ్వర్లు, నరసింహులు, ఇసాక్, యాగంటయ్య, సూర్యనారాయణ ,శేశారెడ్డి, స్వామి , దాసు ,అబ్దుల్ సుభాన్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

తక్‌పట్టి కోసం రైతుల అవస్థలు

- నిద్రావస్థలో పాలకమండలి, అధికారులు
- కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో కర్షకుల, హమాలీల కష్టాలు...

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో రైతులు, హమాలీలను నిత్యం తక్‌పట్టి సమస్య వేధిస్తోంది. మధ్యాహ్నం 2:30 గంటలలోపు రావల్సిన తక్‌పట్టీ సాయంత్రం ఐదు దాటాక గాని రావడంలేదు. దీంతో తూకాలు నిలిచిపోయి సుదూరప్రాంతల నుండి దిగుబడులను తెచ్చే రైతులు, తూకం వేసే హమాలీలు ఇబ్బందులు పడుతున్నారు. తూకంవేసి, రైతు చేతికి సొమ్ము వచ్చే వరకు రాత్రి 9 నుంచి 10గంటలవుతుంది. రైతులు దూరప్రాంతాలకు వెళ్లడానికి అష్టకష్టాలు తప్పడం లేదు.

తక్‌పట్టి అంటే ఏమిటి : తక్‌పట్టి అనేది ఉర్దూపదం వాస్తవంగా తక్కెడ పట్టి అనేవారు. వాడుకలో అది తక్‌పట్టిగా మారింది. తక్‌పట్టి అంటే రైతు మార్కెట్‌కు తెచ్చిన ధాన్యాన్ని తక్కెడ వేశాక అంటే తూకం వేశాక ఎన్ని క్వింటాళ్లు అయింది. ఎంత సొమ్ము వచ్చింది. ఎవరికి అమ్మారనే ఆధారంతో ఉన్న రషీదు. ఇది ఉంటే రైతుతో డబ్బు దేనికి సంబంధించినది అనే రుజువుకు ఉపయోగపడుతుంది. అదే విధంగా అధికంగా పండించేవాళ్లకు తక్‌పట్టి రషీదు ఉంటే ఆదాయశాఖనుంచి పన్ను మినహాయింపుకూడా ఉంటంది.

తక్‌పట్టి 3గంటలలోపు ఇస్తే త్వరగా రైతు ధర నచ్చకపోతే ఇంకొక రోజు పంటను అమ్ముకునేందుకు అవకాశం ఉంటుంది. హమాలీలు తూకం వేయడానికి, లోడ్ చేయడానికి, విత్తనాన్ని శుద్ధి చేసి నింపడానికి సమయం ఉంటుంది. అలాంటిది సాయంత్రం 5 గంటలు అయినా తక్‌పట్టి ఇవ్వడంలేదని రైతులు వాపోతున్నారు. రైతులు, హమాలీలు తమ గ్రామాలకు, ఇంటికి వెల్లెలోపు రాత్రి 9 నుండి 10 గంటలు అవుతుందని, పంట అమ్మగా వచ్చిన నగదుతో చీకట్లో వెళ్లాలంటే దొంగలభయం ఉంటుందని ఆవేదిన చెందుతున్నారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో ఉమ్మడి జిల్లాతో పాటు, తెలంగాణ, కర్ణాటక నుండి కూడా రైతులు పంట దిగుబడులు తెస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్‌లో వాము, వేరుశనగ, కందులు, ఎండుమిర్చి, మొక్కజొన్న, ఆముదాలు, ఉల్లిగడ్డలు, కొర్రలు, మినుములు, ఇలా అనేక పంటలు అత్యధిక సంఖ్యలు రైతులు తెస్తున్నారు. అలాంటి రైతాంగానికి సరైన సేవలు అందించడంలో అటు పాలకమండలి, ఇటు అధికారులు నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరిస్తున్నారు. రైతులు పలుమార్లు అడిగినా సర్వర్ డౌన్ అయింది. కంప్యూటర్స్ పని చేయడం లేదని మధ్యాహ్నం ఇవ్వాల్సిన తక్ పట్టి సాయంత్రం 5 గంటలు దాటినా గాని ఇవ్వడంలేదు. మంగళవారం 5.30 గంటలకు తక్‌పట్టి రైతులకు అందించారు. సాయంత్రం ఆరు గంటలయినా ధర ఎంత పోయిందో మార్కెట్ అధికారులు వివరించడం లేదంటే వారి పనితీరు అర్థమవుతుంది.

కనీస సౌకర్యాలు కరువు : రైతులకు తాగేందుకు నీళ్లు తెచ్చిన ధాన్యం పెట్టడానికి నీడ, లేక నరకం చూస్తున్నారు. కనీసం రైతులకు అందించాల్సిన కనీస సేవలు కొరబడ్డాయి. నిత్యం మార్కెట్ పంటలతో రద్దీగా ఉంటే ఇక్కడ ఉండి మార్కెట్ సమస్యలు చూడాల్సిన చైర్మన్ వారంలో రెండు సార్లు మాత్రమే అలా కనిపించి వెళ్తున్నారు. కార్యదర్శి మధ్యాహ్నం 1 గంటకే భోజనం పేరుతో ఇంటికెళ్తున్నారు. పట్టించుకునే వారు లేక రైతులు, హమాలీలు మార్కెట్‌లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య 10 రోజుల నుండి తీవ్రస్థాయిలో ఉంది. వ్యవసాయ మార్కెట్‌లో తాగు నీరు, మరుగుదొడ్లు, రైతులకు హమాలిలకు నీడ ఉండేలా షెడ్లు వేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. వెంటనే పరిస్కారం చేస్తామని హామీ ఇచ్చిన చైర్మన్, కార్యదర్శి నిద్రావస్థలో ఉన్నారని తమ గోడు వినే నాధుడు లేడని రైతులు హమాలీలు తెలుపుతున్నారు.

సాయంత్రమైనా తక్‌పట్టి ఇవ్వడం లేదు

- రైతు అన్వర్, కలుగొట్ల గ్రామం

46 సంచుల కందులు తీసుకువచ్చాను. మధ్యాహ్నం 2.30 గంటలకు ఇవ్వాల్సిన తక్‌పట్టి, టెండర్ ఫారాలు సాయంత్రం 5 గంటలు దాటినా ఇవ్వడంలేదు. రాత్రి 8 దాటితే గ్రామాలకు బస్సులు లేక బస్టాండ్లలో ఉంటున్నాం. పంట అమ్మి వచ్చిన సొమ్ము దొంగిలించే పరిస్థితులు ఉన్నాయి.

అర్ధరాత్రి దాకా మార్కెట్‌లోనే

- హమాలీ కార్మికులు మద్దిలేటి

టెండర్ జరిగిన వెంటనే తక్‌పట్టి ఇస్తే హమాలీలు వెంటనే చాట, కొత్త, పట్టు బడి, లోడ్ ఆన్ లోడ్ హమాలీలు ఎవరి పనులు వారు త్వరగా చేసి త్వరగా ఇళ్లకు చేరుకుంటాం. తక్‌పట్టి సాయంత్రం 5 దాటాక ఇస్తున్నారు. అర్ధరాత్రి దాకా మార్కెట్ లోనే ఉంటున్నాం. ఇక్కడ కనీస సౌకర్యాలులేవు.

రైతుల అవస్థలు తీర్చాలి

-కట్టా చంద్రశేఖర్ శెట్టి, కమీషన్ దారుల సంఘం కార్యదర్శి

రైతులు హమాలీలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వారికి ఎన్నడూ లేని విధంగా తక్ పట్టి ఇవ్వడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

సమస్యను త్వరగా పరిష్కరించాలి

- రాముడు,మార్కెట్ హమాలీలు సంఘం గౌరవాధ్యక్షులు

రైతులకు ఇవ్వాల్సిన తక్‌పట్టి సమయానికి ఇవ్వాలి. మంచినీరు, నీడ తదితర సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన చైర్మన్ మాట నిలబెట్టుకోవాలి. లేకుంటే ఉద్యమ బాట పడతాం.

పత్తికొండ సబ్‌జైలును తనిఖీ చేస్తున్న జస్టిస్ నాగశ్రీనివాసులు

సబ్ జైలును తనిఖీ చేసిన జస్టిస్ నాగ శ్రీనివాసులు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ సబ్ జైలును జిల్లా న్యాయమూర్తి (డి ఎల్ ఎస్ ఏ) నాగ శ్రీనివాసులు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి నాగ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని ముద్దాయికి ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. భోజనాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పత్తికొండ సబ్ జైల్ పర్యవేక్షణ అధికారి ఎస్ చంద్రమోహన్, లీగల్ ఎయిడ్ అడ్వకేట్ నాగేషు దామోదరచారి, కోర్ట్ సిబ్బంది రమాదేవి, జైలు సిబ్బంది ఎస్ఎం సిరాజ్ బాష, సోమశేఖర్, దస్తగిరి పాల్గొన్నారు..

దోమల నివారణ చర్యలకు సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు కాలనీలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర నాయకులు కె.ప్రభాకర్, 33వ వార్డు కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సాయంకాలం అయిందంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దోమల దండయాత్ర నుంచి ఎలా తమను తమను కాపాడుకోవాలనే ప్రజలు అర్థం కాని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లూరులో బడుగు బలహీన వర్గాల ప్రజలు వివిధ వృత్తులతో జీవనం సాగిస్తున్నారని పగలంతా కష్టపడి రాత్రిళ్ళు హాయిగా నిద్ర పోదామనుకున్ననిద్రరాని పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారని అన్నారు. కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండడం, నివారణ చర్యలు చేయడం లేదని, అందువల్లే స్వైర విహారం చేస్తున్నాయన్నారు.తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి కల్లూరు కాలనీలో వెంటనే వీధుల వెంటదోమల పొగరోజు వదలాలని కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని నీరు నిల్వ లేకుండా కాలువలను శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులు కోరారు. వార్డు ప్రజలు మాధవి లత. కె.లక్ష్మీ దేవమ్మ, హామీదా, షకీరా, నరేష్ పాల్గొన్నారు.

డిహెచ్ పిఎస్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : దళితుల హక్కుల పోరాట సమితి 2024 డైరీన్ ఇన్‌చార్జి డిఇఒ సామ్యూల్ పాల్ మంగళవారం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సి.మహేష్ ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు. డిహెచ్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సి.కుమార్ నగర అధ్యక్ష కార్యదర్శులు కుమార్ రాజా, రామచంద్ర, మాణిక్యం, సులోచన జీవన్ పాల్గొన్నారు..

రిజిస్ట్రేషన్ 9 లోపు పూర్తి కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి- కర్నూల్ కలెక్టరేట్

పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ఈనెల 9వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్ఒలు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, సంబంధిత జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాకు బదిలీపై వచ్చిన మండల స్థాయి అధికారులు ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో తహశీల్దార్లు, ఎంపిడిఒలు ఇద్దరూ కీలకం అని, త్వరితగతిన వారి వారి మండలాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వచ్చే 10, 15 రోజుల్లో ఆయా మండలాల పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ స్టేషన్లను పరిశీలించాలని కలెక్టర్ తహశీల్దార్లు, ఎంపిడిఒలను ఆదేశించారు.సెక్టార్ఆఫీసర్లు, బిఎల్ఒలతో సమావేశం నిర్వహించుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన పనులతో పాటు ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాల అమలుపై కూడా దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఎలక్షన్‌ను కొత్తగానే భావించి, భారత ఎన్నికల సంఘం రూపొందించిన ఎన్నికల నియమావళిపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. కింది స్థాయి సిబ్బంది మీద ఆధార పడకుండా రిటర్నింగ్ అధికారి హ్యాండ్‌బుక్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఇతర నియమాలను తప్పనిసరిగా చదవాలన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఇంత వరకు ఏ పనులు జరిగాయి,ఇంకా ఏం చేయాలి అన్న అంశాలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా పెండింగ్ ఫార్మ్స్ ఎన్ని ఉన్నాయి, అందులో ఫార్మ్ 6, 8లను పరిశీలించి డిస్పోజ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల గురించి వారితో చర్చించాలని సూచించారు. సెక్టర్ అధికారులు పోలింగ్ కేంద్రాలకు వెళ్ళే రోడ్లు బస్సులు వెళ్లేందుకు అనుకూలంగా ఉన్నాయా లేదా, దారిలో అడ్డంగా కరెంట్ తీగలు ఉన్నాయా లేదా పరిశీలించి తమకు తెలియచేస్తే సరి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కులగణన సర్వేలో మన జిల్లా 88 శాతంలో ఉందని, వాలంటీర్స్ ల ద్వారా రేపటి లోపు 90 శాతం పైగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపిడిఒలను ఆదేశించారు. కర్నూలు కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఒ మధుసూదనరావు, కర్నూలు ఆర్‌డిఒ శేషిరెడ్డి, పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి, జెడ్‌పి సిఇఒ నాసరరెడ్డి, ఇతర నియోజకవర్గాల ఆర్ఒలు, జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన, వేదికపై జెసి మౌర్య, కమిషనర్ భార్గవ్ తేజ

సోలార్ పవర్ ప్లాంట్ వద్దు

ఉయ్యాలవాడ గ్రామ సభ ఏకగ్రీవ తీర్మానం-భూములు కాపాడుకున్న రైతులు,ప్రజలు
రైతులకు మద్దతుగా నిలిచిన ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్: సోలార్ పవర్ ప్లాంటు వద్దు...మా పొలాలను కాపాడండి...అంటూ ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామసభలో రైతులు నినదించారు. గ్రామ సర్పంచి శకుంతలమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో రైతుల ఒత్తిడిని తట్టుకోలేక సోలార్ పవర్‌ప్లాంటుకు వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఎపి రైతుసంఘం రైతులకు, గ్రామ ప్రజలకు మద్దతుగా నలిచింది. చివరికి రైతులు, గ్రామస్తులు సోలార్ పవర్‌ప్లాంటు ప్రతిపాదనను తిప్పికొట్టారు. భూములను కాపాడుకున్నారు. మంగళవారం సోలార్ పవర్‌ప్లాంటుకు భూములు సేకరించడానికి అభిప్రాయ సేకరణకు ఉయ్యాలవాడలో సర్పంచి శకుంతలమ్మ అధ్యక్షన సభ నిర్వహించారు. కార్యదర్శి సుమలత , విఆర్ఒ మధుసూదన్ ,అధికారులు పాల్గొన్నారు. సుమలత సభను ప్రారంభించగానే రైతులు గ్రామసభలో పెద్ద పెట్టున్న నినాదాలు చేశారు. సోలార్ ప్లాంట్ మాకు వద్దు..మా పొలాలను కాపాడండి... మా పశువులను, గొర్రెలను, కాపాడండి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ నిరసనను తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్‌ను వ్యతిరేకిస్తూ రైతుల నిరసనకు స్పందించి ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ ప్లాంట్ అవసరం లేదని గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సుమలత అజెండా చదివి వినిపించారు. సుమారు 400 మంది రైతులు గ్రామ ప్రజలతో సంతకాలను చేయించారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుచేస్తామని క్యాబినెట్ తీర్మానం చేయడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారన్నారు. ఇప్పటికే కలెక్టరేట్ ముందు ఆందోళన చేసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారన్నారు. వందలాది మంది రైతులు బోర్లు వేసుకుని, మామిడి ,పూల తోటలు వివిధ రకాల పంటలు సాగుచేస్తున్నారన్నారు. మామిడికి పేరెన్నిక గల ప్రాంతమని తెలిపారు. ఇప్పటికే డిఆర్‌డిఒ పేరుతో ఆ గ్రామంలో ప్రభుత్వ ప్రైవేటు భూములు పోవడం వలన పశువులకు మేత లేక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనివల్ల ఊరంతా ఖాళీ చేసి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఇటువంటి ప్రజా వ్యతిరేకమైన నిర్ణయాలను ప్రభుత్వాలు చేసినప్పుడు రైతులు ప్రజలు రాజకీయాలతో సంబంధం లేకుండా ఐక్యంగా తిప్పి కొట్టాలన్నారు.

మాట్లాడుతున్న జి.రామకృష్ణ

జయహో బిసి సభలో మాట్లాడుతున్న గౌరు వెంకట్‌రెడ్డి

టిడిపితో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి

జయహో బిసి సభలో గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిడిపి పాలనలో బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేశామని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. మంగళవారం గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు చెన్నమ్మ సర్కిల్ లో జయహో బిసి సభ నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ ,జ్యోతిరావు పూలే చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. గౌరు చరిత, వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాల ప్రజలే వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని అన్నారు. నంద్యాల పార్లమెంటు బిసి సెల్ అధ్యక్షులు మల్లికార్జున, పాణ్యం బిసి సెల్ అధ్యక్షులు కృష్ణ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, జిల్లేల శ్రీరాములు, బెస్త సాధికార సంఘం పిజి. వెంకటేశ్, వీర శైవ లింగాయత్ శివ రాజ్, బెస్త సాధికార రామ్‌బాబు, ఈడిగా సాధికార రాష్ట్ర కార్యదర్శి అమర్నాథ్ గౌడ్, బిసి సెల్ రాష్ట కో ఆర్డినేటర్ వడ్డే తిరుపాలు,జిల్లా అధికార ప్రతినిధి ధనుంజయ, మాహనందీ, బోయ రామకష్ణ, కల్లూరు మండల అధ్యక్షుడు రామాంజనేయులు, తడకనపల్లె సర్పంచి సహారాబి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తదితరులు మాట్లాడారు. బిసిలలోని ఆయా సంఘాల నాయకులు, కార్యకర్తలు టిడిపి,జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు ఆర్‌డిఒకు బొకేను అందజేస్తున్న రామాంజనేయులు, వేణుగోపాల్

ఆర్‌డిఒను కలిసిన రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతలు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారి శేసిరెడ్డిని ఎపి రెవెన్యూ ఉద్యోగుల సంఘం కర్నూల్ డివిజన్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వేణుగోపాల్, రామాంజనేయులు, శివరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు ఉన్నారు. రెవెన్యూ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆర్‌డిఓ హామీ ఇచ్చారు.

సూచనలు చేస్తున్న న్యాయమూర్తి శ్రీనివాస రావు

క్షణికావేశంతో జీవితాలు నాశనం

- న్యాయమూర్తి శ్రీనివాస రావు

ప్రజాశక్తి - ఆదోని

క్షణికావేశానికి లోనై చేసే నేరాలకు జీవితాలు నాశనమవుతాయని న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ సిహెచ్.శ్రీనివాస రావు రిమాండ్ ఖైదీలకు సూచించారు. మంగళవారం ఆదోని సబ్ జైల్‌ను ఆయన తనిఖీ చేశారు. జైలును పరిశీలించి ఖైదీలకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులు ఉండి బెయిల్‌కు ష్యూరిటీ ఇవ్వలేని ఖైదీలకు కేంద్ర ప్రభుత్వమే ష్యూరిటీ ఇస్తుందని తెలిపారు. ఆదోని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ శ్రీవల్లి, సీనియర్ న్యాయవాదులు శివకుమార్ స్వామి, లోకేష్, ఆనంద్, కల్యాణ్ రెడ్డి, సాయి కుమార్, హుస్సేన్‌సాని, ఈరన్న, సుబ్బన్న, మండల లీగల్ సర్వీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి విజయానికి కృషి చేస్తాం

- ఆదోని షేకుల్ ఇస్లాం ట్రస్టు సభ్యులు

ప్రజాశక్తి - ఆదోని

కండువా వేస్తున్న మీనాక్షి నాయుడు

వచ్చే ఎన్నికల్లో ఆదోనిలో టిడిపి విజయానికి తమ వంతు కృషి చేస్తామని ఆదోని షేకుల్ ఇస్లాం ట్రస్టు సభ్యులు తెలిపారు. మంగళవారం టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు సమక్షంలో ఆదోని షేకుల్ ఇస్లాం ట్రస్ట్ సభ్యులు తురాబ్ అష్రఫీ, నిసార్ అష్రఫీ, అల్ ఫరీద్ ట్రావెల్స్ యజమాని గౌస్ అష్రఫీ, ఇతర సభ్యులు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2014-19 మధ్యలో ఆదోనిలో టిడిపి హయాంలో ముస్లిం, మైనారిటీల కోసం మీనాక్షి నాయుడు ఎన్నో పనులు చేశారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ముస్లింలకు మేలు చేసే మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. టిడిపి నాయకులు బసాపురం రామస్వామి, టిడిపి ముస్లిం, మైనారిటీ నాయకులు సాదుల్లా, మాజీ కౌన్సిలర్ మహబూబ్ బాష పాల్గొన్నారు.

సిసి రోడ్డుకు భూమి పూజ

ప్రజాశక్తి - ఆదోని

భూమి పూజ చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ శాంత

ఆదోనిలోని 6వ వార్డు షేర్‌ఖాన్ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ శాంత భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శాంత, వైసిపి ఇన్‌ఛార్జీ జయమనోజ్ రెడ్డి మాట్లాడారు. 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా సిసి రోడ్ల నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. 2024లో ప్రజల ఆశీస్సులతో మళ్లీ వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, వార్డు ఇన్‌ఛార్జీ రామకృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ గౌస్, నరసింహులు, కామాక్షి తిమ్మప్ప, రఘునాథ్ రెడ్డి, సన్నీ, చక్రి, రితిసింగ్, దినేష్, అశోక్, సింహం నాగేంద్ర, నల్లారెడ్డి, హెచ్.నల్లారెడ్డి, తిమ్మారెడ్డి, వెంకట్, సునా, ఈశ్వర్, రాము పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

- లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ గోపీనాథ్

ప్రజాశక్తి - ఆదోని

రహదారి భద్రత నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు డ్రైవర్లు సహకరించాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. మంగళవారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆదోని ఆర్‌టిసి గ్యారేజీలో మెడికల్ క్యాంపు నిర్వహించి ఆర్‌టిసి డ్రైవర్లు, సిబ్బందికి కంటి పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రాణం ఎంతో విలువైందని, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగి జీవితాలను కోల్పోయారని తెలిపారు. చిన్న తప్పిదం, నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని నాశనం చేస్తుందన్నారు. కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చాలని కోరారు. లయన్స్ క్లబ్ ఛైర్మన్ ధర్మా రెడ్డి, రీజనల్ ఛైర్మన్ ప్రసాద్ రావు, ఈసీ మెంబర్లు వేణుగోపాల్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సుజాత, కృష్ణమూర్తి, సభ్యులు కెఎం.గౌడ్, ఎంఎఫ్.వేణుగోపాల్, ఎస్‌టియు రాఘవేంద్ర ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- డాక్టర్‌కు ఆశాల వినతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8న విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆశావర్కర్స్ యూనియన్ మండల నాయకులు జయలక్ష్మి, రాజేశ్వరి, విశాలాక్షి, ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మెడికల్ ఆఫీసర్స్‌కు సమ్మె నోటీసు అందజేశారు. మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబలం గ్రామాల్లో వారు మాట్లాడారు. గ్రామాల్లోని పేదలకు నిత్యం ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఆశావర్కర్లపై పని భారం తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. అర్హత కలిగిన ఆశాలను కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా గుర్తించాలని, ఆశావర్కర్లకు ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

డాక్టర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఆశావర్కర్లు

సమ్మెకు కూడా వెనకాడం

- 1న పెన్షన్ జమ చేయలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం

- ఎపి ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అడిగినా పెడచెవిన పెట్టి ఉద్యోగ, ఉపాధ్యాయులను ఇబ్బందులు గురిచేయడం ప్రభుత్వానికి తగదని, మొండిగా వ్యవహరిస్తే మూకుమ్మడిగా సమ్మెకు కూడా వెనకాడబోమని ఎపి ఎన్‌జిఒస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు యాసిన్ బాష హెచ్చరించారు. మంగళవారం ఆదోనిలోని ఎన్‌జిఒస్ హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించకపోతే రాష్ట్ర ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదన్నారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నాలుగున్నర ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. పిఆర్‌సి కమిటీలోనూ అన్యాయం జరిగిందన్నారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేకపోతే సమ్మెలోకి వెళ్తున్నట్లు ఈనెల 12న ఎపి జెఎసి రాష్ట్ర కమిటీ నాయకులు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి నోటీసు అందజేస్తారని తెలిపారు. పిఆర్‌సి కమిటీ నివేదిక ఆలస్యం అవుతుందని, వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిఎ అరియర్స్, సరెండర్ లీవ్స్ బకాయిలను చెల్లించాలని కోరారు. ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు 1న జీతాలు తీసుకుంటున్నప్పుడు పెన్షనర్లు ఏం పాపం చేశారని పెన్షన్ జమ చేయడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 1న పెన్షన్లు చెల్లించలేని దౌర్భాగ్య స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎన్‌జిఒ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున రెడ్డి, ఉపాధ్యక్షులు ఉషారాణి, విజయ్ రాజు, రామ్మోహన్ రెడ్డి, బజారప్ప, ఆంజనేయులు, షేకన్న, నాగేంద్ర ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ రెడ్డి

మార్కెట్ యార్డు ఛైర్మన్ నుంచి ప్రాణహాని

- నేమకల్లు సర్పంచి ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ తనను ఫోన్‌లో బెదిరిస్తున్నారని, ఆయన నుంచి తనకు ప్రాణహాని ఉందని చిప్పగిరి మండలం నేమకల్లు సర్పంచి ప్రేమ్ కుమార్ తెలిపారు. మంగళవారం చిప్పగిరిలోని నాలుగు రోడ్ల కూడలి అంబేద్కర్ విగ్రహం ముందు సర్పంచి ప్రేమ్‌కుమార్, నగరడోనా సర్పంచి భర్త నాగేంద్ర, ఏరూరు సర్పంచి భర్త సేనాపతి, నేమకల్లు ఎంపిటిసి సుంకన్న, వైసిపి సీనియర్ నాయకులు సత్తిరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి ప్రేమ్ కుమార్ మాట్లాడారు. వైసిపి ఇన్‌ఛార్జీ విరుపాక్షి వెంట ప్రచారానికి వెళ్లకూడదని.. సమావేశాలకు రాకూడదని బెదిరింపులకు గురి చేసినట్లు వాపోయారు. విరుపాక్షి వెంట తిరిగితే చంపేస్తానని బెదిరించినట్లు తెలిపారు. 'నీవు ఏ పార్టీలోకి వెళ్లినా, ఏ పార్టీలో టికెట్ తెచ్చుకున్నా.. మంత్రి జయరామన్నకు సపోర్ట్ చేయాలే తప్ప.. వేరే వారికి సపోర్ట్ చేస్తే నీవు ఎలా తిరుగుతావో.. ఎలా ఉంటావో.. నీ కథ చూస్తాను. నేనేమిటో చూపిస్తాను' అని ఫోన్‌లో భయభ్రాంతులకు గురి చేసినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ నుంచి తనకు ప్రాణహాని ఉందని ఎస్పీకి, డిఐజికి, స్థానిక పోలీసులకు పత్రికల ద్వారా విన్నవించుకుంటున్నట్లు తెలిపారు. తనకు కానీ, తన కుటుంబ సభ్యులకు కానీ ప్రాణహాని జరిగితే గుమ్మనూరు నారాయణ కారణమని చెప్పారు. వైసిపిలో పార్టీ కోసం చాలా ఏళ్ల నుంచి పనిచేశామని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి టికెట్ ఎవరికిచ్చినా పార్టీ కోసం పనిచేస్తానని తెలిపారు.

మాట్లాడుతున్న సర్పంచి ప్రేమ్ కుమార్

పబ్లిక్ పరీక్షల పట్ల భయాందోళన వద్దు

- న్యాయవాది షేక్షావలీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రాఘవరావు

ప్రజాశక్తి-ఆలూరు

విద్యార్థులు పబ్లిక్ పరీక్షల పట్ల భయాందోళన చెందవద్దని న్యాయవాది షేక్షావలీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రాఘవరావు తెలిపారు. మంగళవారం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో 'ప్రజ్ఞా వికాసం' పదో తరగతి మోడల్ పరీక్షలు నిర్వహించారు. అంతకుముందు వారు ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల పట్ల అవగాహన కోసం, పబ్లిక్ పరీక్షల పట్ల భయాందోళన చెందకుండా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పరీక్షలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని పబ్లిక్ పరీక్షల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం డివైఎఫ్‌ఐ మండల కార్యదర్శి మైనా మాట్లాడారు. మోడల్ పరీక్షలకు మండలంలో 450 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై, చదువుకోవడానికి ఎస్‌ఎఫ్‌ఐ ముందుండి పోరాడుతుందని చెప్పారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, గోవర్ధన్, ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కో కన్వీనర్లు త్రిష, జమీల, మీనాక్షి, శంషాబీ, మండల ఉపాధ్యక్షులు గిరిమూర్తి పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న న్యాయవాది, ప్రిన్సిపల్

ఘనంగా శ్రీదస్తగిరి స్వాముల ఉరుసు

పజాశక్తి - నందవరం

మండలంలో కనకవీడు గ్రామంలో శ్రీదస్తగిరి స్వాముల ఉరుసు నిర్వహించారు. పంచాయతీ పెద్దల కెఆర్.లక్ష్మీకాంత రెడ్డి, కె.రఘు మూర్తి స్వామి, సర్పంచి మద్దేశ్వరి, వైస్ ఎంపిపి నడిపి షేక్ సాబ్, ఎంపిటిసి సావిత్రి సమక్షంలో సోమవారం గంధం, మంగళవారం ఉరుసు నిర్వహించారు. బుధవారం జర్ధాల్ నిర్వహించనున్నారు. గ్రామంలో కుల, మతాలకు అతీతంగా గ్రామస్తులు ఉరుసు సంబరాలు చేసుకున్నారు. అలాగే కబడ్డీ పోటీలను కూడా నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎమ్మిగనూరు నటరాజ్ పత్తి మిల్లు యజమాని మొదటి బహుమతిని అయిజ మండలం మేడికొండ గ్రామానికి జట్టుకు రూ.6,016, రెండో బహుమతి సోడా ఈరన్న, టీ స్టాల్ హరి కనకవీడు లక్కీ స్టార్స్‌కు రూ.4,016 అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా ఎస్ఐ పి.తిమ్మయ్య, పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

శివాలయ పునర్నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - చిప్పగిరి

శివాలయ పునర్నిర్మాణానికి వైసిపి ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి రూ.30 వేలు విరాళంగా అందజేశారు. దేవనకొండ మండలం లక్కందిన్నె గ్రామ పెద్దలు లక్ష్మన్న, కోయిలతోట ఆచారి, గొల్ల రాముడు, చాకలి రామదాసు, వడ్ల కృష్ణమాచారి, కురువ రామకృష్ణ, లక్ష్మప్ప, కారప్ప, సోమప్పలు మంగళవారం విరుపాక్షిని కలిశారు. గ్రామంలో శివాలయం పునర్నిర్మాణం చేపట్టామని, సహాయం అందించాలని కోరారు. విరుపాక్షి స్పందిస్తూ గ్రామాల్లో దేవాలయాల నిర్మాణాలు శాశ్వతంగా ఉండిపోతాయని, తన వంతు సహాయం ఇప్పటికీ రూ.30 వేలు అందజేస్తానని తెలిపారు. భవిష్యత్తులో ఏదైనా అవసరం పడినా తన సహాయ, సహకారాలు ఎప్పుడూ ఉంటాయని చెప్పారు. విరుపాక్షికి గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

లక్కందిన్నె గ్రామ పెద్దలకు విరాళం అందజేస్తున్న విరుపాక్షి

'సిద్ధం' మహాసభకు భారీగా తరలిరండి

- వైసిపి ఇన్‌ఛార్జీ విరుపాక్షి, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య

ప్రజాశక్తి - చిప్పగిరి

ఈనెల 11న అనంతపురంలో వైసిపి నిర్వహిస్తున్న 'సిద్ధం' మహాసభకు భారీగా తరలి రావాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, సొసైటీ ఛైర్మన్ మల్లికార్జున కోరారు. మంగళవారం చిప్పగిరి గోవిందప్ప స్వామి ఆలయ ఆవరణలో 'సిద్ధం' గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఉన్న ప్రతి గడపకూ న్యాయం చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల దీవెనలు ఎల్లవేళలా ఉంటాయని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో చిప్పగిరి మండలంలోని ప్రతి గ్రామంలోనూ తిరుగుతానని, సర్పంచులు, ఎంపిటిసిలు ఎవరూ అపార్థం చేసుకోవద్దని తెలిపారు. సర్పంచులు, ఎంపిటిసిల మద్దతు, సహకారంతోనే ముందుకెళ్లే సాహసం చేస్తున్నానని చెప్పారు. వైసిపి కో కన్వీనర్ లోకనాథ్, సర్పంచి ప్రేమ్ కుమార్, ఏరూరు సర్పంచి భర్త సేనాపతి, నగరడోనా సర్పంచి భర్త నాగేంద్ర, ఎంపిటిసి సుంకన్న, సచివాలయ కన్వీనర్ సత్తిరెడ్డి, ఉప సర్పంచి పెద్ద పెద్దయ్య, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, వైసిపి నాయకులు జూటూరు లింగన్న, మహానంది, హనుమంతు, మల్లికార్జున, భీమప్ప, సుంకన్న, సీనప్ప, మోహన్ పాల్గొన్నారు.

'సిద్ధం' గోడపత్రికను ఆవిష్కస్తున్న నాయకులు

పార్టీకి కార్యకర్తలే పునాదులు

ఆలూరు : వైసిపికి కార్యకర్తలే పునాదులని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి తెలిపారు. మంగళవారం ఆలూరు మండల కన్వీనర్ చిన్న ఈరన్న ఆధ్వర్యంలో 'సిద్ధం'లో భాగంగా మండలంలోని ఎం.కొట్టాల, కె.కొట్టాల, మొలగవల్లి గ్రామాల్లో బి.విరుపాక్షి పర్యటించి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటి గడపకూ చేరాయని తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా పథకాలను బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తే సంక్షేమం, అభివృద్ధి చేసి రాష్ట్ర ప్రజలు ఆర్థిక, ఉపాధితో అభివృద్ధి చెందుతారని తెలిపారు. 11న అనంతపురంలో జరిగే 'సిద్ధం' కార్యక్రమానికి జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు పాల్గొనాలని కోరారు. అంతకుముందు మొలగవల్లి గ్రామంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. వైసిపి నాయకులు రామాంజినేయులు, ఎంపిపి తనయుడు వీరేష్, ఎంపిటిసి దేవరాజు పాల్గొన్నారు.

ఆలూరులో మాట్లాడుతున్న విరుపాక్షి

క్రాంతికుమార్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

రసాయన శాస్త్ర విభాగాధిపతికి డాక్టరేట్ ప్రదానం

- అధ్యాపకుల అభినందనలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని శ్రీమహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బి.క్రాంతి కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. డిజైన్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ మెటల్ ఆక్సైడ్/సల్ఫైడ్ బేస్డ్ హెటిరోజంక్షన్ నానో కాంపోసిట్స్ ఫర్ గ్యాస్ సెన్సింగ్ అప్లికేషన్స్ అనే అంశంపైన ప్రొఫెసర్ విజయకుమార్ ఆధ్వర్యంలో చేసిన పరిశోధనకు క్రాంతికుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.మహబూబ్ బాషా మాట్లాడుతూ... తమ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగాధిపతిగా, వైస్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ బి.క్రాంతి కుమార్ రసాయన శాస్త్రంలో గ్యాస్ సెన్సింగ్ అప్లికేషన్స్ మీద పరిశోధన చేశారని తెలిపారు. ఆయనకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ రావడం ఆనందంగా ఉందని చెప్పారు. ఇలాంటి పరిశోధనలు మరెన్నో చేసి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల అధ్యాపకులు, సూపరింటెండెంట్‌లు కలిసి క్రాంతికుమార్‌ను అభినందించారు.

15లోపు ఈకేవైసీ, పంటల నమోదు చేసుకోవాలి

- ఎడిఎ మహ్మద్ ఖాద్రీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈనెల 15లోపు మండలంలోని రైతులందరూ పంట నమోదు చేసుకొని ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ హేమలత తెలిపారు. మంగళవారం వారు మండలంలోని హెచ్.కైరవాడి, పెద్దనేలటూరు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు 60 శాతం మాత్రమే ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. రైతులందరూ వెంటనే తమ పరిధిలోని రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని సూచించారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- ఎంపిపి భర్త లుముంబా, వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలో మహిళలకు చెక్కు అందజేస్తున్న నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పథకం కింద అందజేస్తున్న రుణాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపిపి భర్త లుముంబా, వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, ఎంపిటిసి తపాల శ్రీనివాసులు నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక ముగితాత కమ్యూనిటీ హాలులో ఆసరా పథకం కింద 627 పొదుపు మహిళా గ్రూపులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1,92,95,000 చెక్కును మహిళలకు అందజేశారు. వైఎస్ఆర్ క్రాంతి పథకం ఎపిఎం రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం అమ్మఒడి, చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, చేదోడు వంటి సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమైందని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వం పొదుపు మహిళల రుణాలను మాఫీ చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. మహిళలకు సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. ఎఒ సురేష్ బాబు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ రామకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ వాస చారి, వైఎస్ఆర్ క్రాంతి పథకం హెచ్‌డి సిసి నరసన్న, సిసిలు రమేష్, ప్రభాకర్, సోమన్న, వైసిపి నాయకులు వెలమకూరు రామచంద్ర, టోపీ యూసుఫ్ బాష, ఉరుకుంద పాల్గొన్నారు. **ఆస్పరి** పట్టణంలోని రామతీర్థ సమీపంలోని గోడౌన్‌లో ఎపిఎం రాఘవేంద్ర అధ్యక్షతన పొదుపు మహిళల సమావేశం నిర్వహించారు. మండలంలో 1,254 గ్రూపులకు గాను రుణాలు తీసుకొని క్రమంగా లోన్ కట్టుకుంటున్న 384 మహిళా గ్రూపులకు రూ.1,58,76,000 చెక్కును అందజేశారు. కెడిసిసి బ్యాంకు జిల్లా డైరెక్టర్ రాఘవేంద్ర, వైసిపి మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ మంచి కృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ అనిల్ కుమార్, మహిళా మండల సమైక్య అధ్యక్షులు భాగ్యమ్మ, కార్యదర్శి లక్ష్మి, వెలుగు సిసిలు మస్తాన్, అశ్విన్ కుమార్, ముద్దు రంగడు, నిర్మలమ్మ, రాజ్యలక్ష్మి, భాస్కర్ పాల్గొన్నారు.

ఆస్పరిలో చెక్కును పంపిణీ చేస్తున్న రాఘవేంద్ర

అందరి సహకారం మరువలేనిది

- ఎంపిడిఒ గీతావాణి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

విధి నిర్వహణలో అందరి సహకారం మరువలేనిదని బదిలీ ఎంపిడిఒ గీతావాణి తెలిపారు. మండలంలో సుదీర్ఘ కాలం ఎంపిడిఒగా పని చేసి అనంతపురం జిల్లా రాప్తాడు మండలానికి బదిలీ అయిన ఎంపిడిఒ గీతావాణికి మంగళవారం స్థానిక మండల ప్రజా కార్యాలయ పరిషత్ సమావేశపు భవనంలో ఆత్మీయ వీడోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎంపిడిఒ గీతావాణి మండలంలో తన సేవలను అందించి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. కరోనా విజృంభణ సమయంలో వైరస్ వ్యాప్తి చెందకుండా నియంత్రించి ప్రజలను కాపాడాలరని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వీలైనంత ఎక్కువ మందికి అందించేలా చేశారని చెప్పారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థలో ఉద్యోగులకు వెన్నంటి ఉండి వారికెలాంటి ఇబ్బందులు వచ్చినా తగిన సలహాలు, సూచనలు ఇస్తూ కార్యక్రమాలు సజావుగా నిర్వహించేలా చూశారని తెలిపారు. అనంతరం గీతావాణి మాట్లాడారు. మండలంలో పని చేసిన సమయంలో అన్ని వర్గాల నుంచి తనకు సంపూర్ణ సహకారం అందిందని తెలిపారు. రాజకీయ నాయకులు, కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మీడియా మిత్రుల సహకారంతో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలను సజావుగా నిర్వహించానని తెలిపారు. అనంతరం ఎంపిడిఒ గీతావాణిని కార్యాలయ సూపరింటెండెంట్ శేఖర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు వీరభద్రప్ప, అభి, ఇన్‌ఛార్జీ ఇఒఆర్‌డి నాగరాజ్, ఎపిఎం జనార్ధన, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, నాగరాజ్, కృష్ణ, విజయలక్ష్మి, షేక్ అహ్మద్, సర్పంచులు ప్రహ్లాద్ యాదవ్, ధనలక్ష్మి, మాజీ ఎంపిపి పంపాపతి, సాదాపురం మురళీ, ఉల్చెప్ప, కార్యాలయ సిబ్బంది పూలమాలలు, శాలువాలు వేసి ఘనంగా సన్మానించారు. పంచాయత్ రాజ్ ఎఇ మాలిక్ పాల్గొన్నారు.

గీతావాణిని సన్మానిస్తున్న సిబ్బంది

ఎఒపై విచారణ చేపట్టాలి

- జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ

ప్రజాశక్తి - మంత్రాలయం

అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎఒ జీరా గణేష్‌పై జిల్లా అధికారులు విచారణ సక్రమంగా జరగాలని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ కోరారు. మంగళవారం జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ ఆధ్వర్యంలో స్థానిక ప్రయివేట్ లాడ్జీలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఎఒ గణేష్ నకిలీ విత్తనాలు, నకిలీ మందులు, అవినీతి, అక్రమాలపై గత మూడు నెలల క్రితం జై భీమ్ ఎంఆర్‌పిఎస్ నుండి ఫిర్యాదు చేస్తే, బుధవారం విచారణకు వస్తున్నారంటే అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు విచారణ జరిపి, రైతులకు నకిలీ విత్తనాలు పురుగు మందుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. డీలర్లతో కుమ్మక్కై బయో పురుగు మందుల వ్యాపారం చేస్తూ అక్రమార్జనకు తెరతీశారని చెప్పారు. ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టాలని, లేకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ సంఘటి యోహాను మాదిగ, నియోజకవర్గ నాయకులు కందనాతి మారెన్న, మండల అధ్యక్షులు గాడిమోడి నరసింహులు మాదిగ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిక్కం జానయ్య మాదిగ

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును గౌరవిస్తాం

- కేంద్రం తెచ్చిన ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లపై మందకృష్ణ ఎందుకు నోరు మెదపరు..?

- జై భీమ్ మాల మహానాడు రాష్ట్ర నాయకులు రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో ఏ తీర్పు ఇచ్చినా గౌరవిస్తామని జై భీమ్ మాలమహానాడు రాష్ట్ర నాయకులు సి.రంగయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ అంశాన్ని అడ్డుపెట్టుకొని దళితులను చీల్చి రాజ్యాధికారానికి దూరం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వాలు పని చేస్తున్నాయని తెలిపారు. గతంలో వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని చెప్పిన అత్యున్నత న్యాయస్థానం.. తిరిగి మరో తీర్పునకు తెరపైకి రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ రాజ్యాంగ విరుద్ధమని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వర్తించని రిజర్వేషన్లు ఎందుకు పెట్టారని ప్రధాని మోడీని మందకృష్ణ ఎందుకు నిలదీయలేకపోయారో దళిత జాతికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం మాలల విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ అభివృద్ధిని ఓర్వలేక వర్గీకరణ అంశం అడ్డు పెట్టుకుని ఏళ్ల తరబడి మాదిగలను వంచిస్తూనే ఉన్నారని విమర్శించారు. జిల్లా అధ్యక్షులు మాల మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు పరమేష్, యువదళం జిల్లా అధ్యక్షులు నల్లన్న, సెక్రటరీ బలరాం, రాముడు, మాలమహానాడు సీనియర్ నాయకులు రాజోలప్ప, రంగముని, గిరి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య

ప్రతికాప్రకటన

IN THE COURT OF THE HON'BL IIIrd ADDITIONAL JUNIOR CIVIL JUDGE-CUM-SPECIAL MOBILE COUET : KURNOOL

O.S.NO.1089/2021

Imamkasim. ...Petitioner

V/S

Bollu Ratnamma. ...Respondent

సమన్ల నోటీసు

ఇందుమూలముగా క్రింద కనపరిచిన ప్రతివాదికి తెలియజేయడము ఏమనగా దావా నెంబర్ 1089/2021 పై ఘనపరిచిన కోర్టులో వాది మీ పైన కేసు వేసి ఉన్నారు పలుమార్లు మీకు నోటీసులు పంపినప్పటికీ మీరు వాటిని తీసుకోక పొగ వాటిని వాపాసు పంపుచుండటం వలన గౌరవ పైకోర్టు వారు నేను వ్రాసుకున్న అర్జీ మేరకు గౌరవ కోర్టు వారు ప్రజాశక్తి కర్నూలు జిల్లా డైలీ పేపరు ద్వారా మీకు కేసు విషయము తెలియజేయుటకు పత్రిక ప్రకటన అనుమతి ఇచ్చినందున ప్రజాశక్తి డైలీ పబ్లికేషన్ దినపత్రిక ద్వారా మీకు ఈ విషయమును తెలియజేయడమైనది కావున ఇందులో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల 22-02-2024 వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో మీరు కానీ మీ తరఫున న్యాయవాది కానీ హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపన వచ్చును లేనియెడల పరోక్షమున పై అర్జీని కేసును విచారించి తీర్మానించబడును ఇందుమూలముగా తెలియజేయడమైనది

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా తేదీ : 22-02-2024

షెడ్యూలు :

బొల్లు రత్నమ్మ
భర్త బి.తిరుపతయ్య
ఇంటి నెంబర్ 89/803 ఎ.పి.యస్.పి.క్వాటర్స్,
కర్నూల్ టౌన్, కర్నూలు జిల్లా.

ఇట్లు
బత్తుల చిన్నయ్య,
అర్జీదారుని తరపు న్యాయవాది, కర్నూలు.
సెల్ : 9908750588

గోడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి

ఈ సారైనా ఇస్తారా..?

- జిల్లా ప్రాజెక్టులకు దక్కని నిధులు - ఈ బడ్జెట్‌పై కొత్త జిల్లా వాసుల ఆశలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నంద్యాల జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు ముందుకు కదలడం లేదు. గత కొన్నేళ్లుగా రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలోని ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకపోవడంతో ఏ ప్రాజెక్టూ ముందుకు సాగడం లేదు. చాలా ప్రాజెక్టులు శంకుస్థాపనకే పరిమితం అయ్యాయి. బుధవారం రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన జిల్లా అభివృద్ధికి నిధులు ఇస్తారా? లేదా? అని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు....

గతేడాది రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు గురించి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టుల అంచనాలను పక్కనబెట్టి మొక్కుబడిగా నిధులు కేటాయించారు.

సాగని జొలదరాసి

కోవెలకుంట్ల మండలం జొలదరాసి పైలెట్ ప్రాజెక్టుకు 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సంవత్సరంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భూమి పూజ చేసినా ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. భూసేకరణ కూడా జరగలేదు. ఆళ్లగడ్డ, శిరివెళ్ల, చాగలమర్రి, రుద్రవరం మండలాల్లో తెలుగు గంగ లైనింగ్ పనులు ముందుకు సాగడం లేదు.

రాజోలికి పడని అడుగులు

చాగలమర్రి మండలంలో రాజోలి వద్ద నిర్మించనున్న రిజర్వాయర్‌కు అడుగులు పడలేదు. ప్రతి ఏటా కుందూ నది నుంచి వచ్చే వరద నీరు సోమశిలకు చేరి, ఆ తరువాత సముద్రంలో కలిసి వృథా అవుతోంది . దీంతో రాజోలి వద్ద 2.95 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. 2008 డిసెంబరు 24న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశే ఖర్ రెడ్డి రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తరువాతి ప్రభుత్వాలు పట్టించుకోకపోవ డంతో నీటి వృథా కొనసాగుతోంది. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకా 2.95 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి జీవో ఇచ్చారు. రూ .1,357.10 కోట్లతో చేపట్టే పనులకు జ్యుడీషియల్ ప్రివ్యూ ఆమోదం లభించింది. ఈ పనులకు జలవనరుల శాఖ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. అయినా ఇప్పటి వరకూ పనులు ప్రారంభం కాలేదు.

మారని 'నూతన' పాలన

ఉమ్మడి కర్నూలు జిల్లాలో భాగంగా ఉన్న నంద్యాల కొత్త జిల్లాగా ఏర్పడింది. నూతన జిల్లా ఏర్పడి దాదాపు ఏడాది కావస్తున్నా జిల్లాలో పాలన స్తబ్ధతగా సాగుతోంది. జిల్లా కార్యాలయాలకు కావలసిన మౌలిక సదుపాయాలు ఇంకా పూర్తి స్థాయిలో ప్రభుత్వం కల్పించలేదు. జిల్లాలకు ప్రధాన పరిపాలనా విభాగమైన కలెక్టరేట్‌కు ఆర్ఎఆర్ఎస్‌లోని ల్యాబొరేటరీలో 3 గదులను కేటాయించారు. కలెక్టర్, జెసి, డిఆర్ఒ ఛాంబర్లను అక్కడ ఏర్పాటు చేశారు. అవసరమైన మౌలిక వసతులేవీ అక్కడ లేవు. సరిపడా గదులు లేకపోవడంతో డిఆర్ఒ కార్యాలయ సిబ్బంది నంద్యాల ఆర్‌డిఒ కార్యాలయం నుంచి విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ కూడా కనీస సదుపాయాలేవీ లేవు. పలు కార్యాలయాల్లో నేటికీ ఇంకా అరకొర సౌకర్యాలే ఉన్నాయి. అనేక జిల్లా ప్రభుత్వ కార్యాలయాల్లో కనీస వసతులు లేవు.

ఈవిఎంల భద్రతకు భవనాలు ఎంపిక

- ఆర్‌జిఎం, శాంతిరాం, సిడబ్ల్యుసి గోడౌన్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవిఎంల భద్రత రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలను మంగళవారం పట్టణ శివారు ప్రాంతంలోని ఆర్‌జిఎం ఇంజనీరింగ్ కాలేజీ, శాంతిరాం ఫార్మసీ అండ్ ఇంజనీరింగ్ కాలేజీ, పట్టణంలోని సిడబ్ల్యుసి గోడౌన్‌లను జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్పీ కె.రఘువీర్ రెడ్డిలు పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పోలింగ్ పిదప ఇవిఎంల భద్రతా భవనాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలను పరిశీలించారు. ఒక్కో అసెంబ్లీకి రెండు భవనాలు, పార్లమెంట్‌కు రెండు భవనాలు చొప్పున నాలుగు భవనాలు, ఆరు నియోజకవర్గాలకు 24 భవనాలు అవసరమవుతాయని గుర్తించారు. వీటితో పాటు అన్ని నియోజకవర్గాల పోలింగ్ సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికి అవసరమయ్యే భవనాలను కూడా పరిశీలించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. అంతకుముందు నంద్యాల రైల్వే స్టేషన్ సమీపంలో వున్న సిడబ్ల్యుసి గోడౌన్‌లోని భవనాలను, ఓట్ల లెక్కింపు, స్ట్రాంగ్ రూముల కోసం కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ డిఎస్పి రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్డిఓ మల్లికార్జున రెడ్డి, డిఎస్ఒ వెంకట్రాముడు, నంద్యాల, పాణ్యం తహశీల్దార్‌లు చంద్రశేఖర్ రెడ్డి, ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమల అడవిలో మంటలు

ప్రజాశక్తి - మహానంది

మహానంది, సిరివెళ్ల మండలాల సరిహద్దులోని నంద్యాల-గిద్దలూరు జాతీయ రహదారి పక్కన నల్లమల అడవి ప్రాంతంలో సోమవారం రాత్రి మంటలు చెలరేగాయి. శ్రీ సర్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి కిలోమీటర్ దూరంలో వెదురు వనాలు ఉన్న ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయని ప్రయాణికులు తెలిపారు. ఈ అడవి ప్రాంతంలో రోజుకు వేలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. ఈ మార్గంలో ప్రయాణించిన ప్రతి వాహనానికి కార్లకు 50 రూపాయలు, లారీ, బస్సుకు వంద రూపాయలు చొప్పున వసూలు చేస్తూ వేలాది రూపాయలు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్న అటవీ అధికారులు అటవీ సంరక్షణలో మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నల్లమల అడవిలో మంటలు వ్యాపించడం వలన వన్యప్రాణులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అధికారులు అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

నల్లమల అడవిలో కాలిపోతున్న చెట్లు

8న చలో విజయవాడ

- జయప్రదం చేయాలి : సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్

ఆత్మకూరులో వైద్య అధికారిణికి వినతిపత్రం అందిస్తున్న ఆశా వర్కర్లు

ప్రజాశక్తి - విలేకరులు

ఈ నెల 8న తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటయు, ఆశా వర్కర్స్ యూనయన్ నాయకులు కోరారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆత్మకూరు, బేతంచెర్ల, నందికొట్కూరు, ప్యాపిలిలో ఆయా పిహెచ్‌సి, ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

ఆత్మకూర్: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించా లని ఆశా వర్కర్లు, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ నందు వైద్యాధికారికి, బైర్లూటి, కొట్టాల చెరువు పిహెచ్‌సి వైద్యాధికారులకు ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు భారతి, సుజాత తదితరులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం టీఏ, డిఏ చెల్లించడం లేదని, ఆశాలకు పని భారం ఎక్కువైందని, సమయం, సెలవులు లేవు ఆశా కార్యకర్తలు అనారోగ్యాలకు గురవుతు న్నారన్నారు. చనిపోయిన ఆశాలకు ఎక్స్ గ్రేసియా, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. మెటర్నరీ లీవులు ఆశాలకు వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వం నాసిరకం సెల్ ఫోన్లు సరఫరా చేయడం ద్వారా పనిచేసిన లెక్కింపులోకి రావడం లేదన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. ప్రతినెల గౌరవ వేతనం మొత్తం ఒకటేసారి ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా మిగతా 6వ పేజీలో...

శ్రీశైలంలో మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో భారీగా మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు సిఐ ప్రసాదరావు తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో సిఐ మాట్లాడారు. టోల్‌గేట్ సమీపంలోని ఓ గుడిసెలో మహిళ మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేసి పట్టుకున్నట్లు చెప్పారు. క్షేత్ర పరిధిలో దేవదాయ చట్టం ప్రకారం మద్యం, మాంసం వంటివి అమ్మడం, సేవించడం నిషేధమన్నారు. తెలంగాణకు చెందిన మహిళ రమావత్ విజ్జి శ్రీశైలంలో గుడిసె వేసుకుని జీవిస్తుందన్నారు. తెలంగాణ మద్యాన్ని తీసుకొచ్చి ఇక్కడ ఎక్కువ ధరకు అమ్ముతుందని తెలిపారు. 166 మద్యం బాటిళ్లను, ఒక డ్రమ్ములో కల్లును స్వాధీనం చేసుకుని మహిళను రిమాండ్‌కు తరలించనట్లు చెప్పారు. రమావత్ విజ్జి క్షేత్రానికి వచ్చే భక్తులకు, స్థానికులకు మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న ఒక స్థానిక వ్యక్తి దేవస్థానం అధికారులకు సమాచారం చేరవేశారు. దేవస్థానం సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించిన తర్వాత పోలీసులకు సమాచారం అందించారు. సిఐ ప్రసాదరావు, ఎస్ఐ లక్ష్మణరావులు సిబ్బందితో కలిసి గుడిసెలో తనిఖీలు చేయగా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

మాట్లాడుతున్న సిఐ ప్రసాద రావు

స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ఒప్పందాల జిఒలు విడుదల చేయాలి

- సిఐటియు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్ కాంట్రాక్ట్, వాటర్ వర్క్స్, నగర పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జరిగిన 16 రోజుల నిరవధిక సమ్మెలో చర్చల సందర్భంగా మంత్రుల బృందం చేసిన ఒప్పందాలకు జీవోలను తక్షణమే ఇవ్వాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, భాస్కరాచారిలు డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధి బృందం మున్సిపల్ ఛైర్మన్ షేక్ మాబున్నీ సా, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఐఏఎస్ బృందం కమిటీ ఇచ్చిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవోలు విడుదల చేయాలని కోరారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులందరికి ఏపిసిఓఎస్ నుండి మినహాయింపు యివ్వాలన్నారు. వాటర్ వర్క్స్, స్ట్రీట్ లైటింగ్, ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలకు సంబంధించిన గతంలో పంపిన 13 మంది కంప్యూటర్ ఆపరేటర్ల జాబితాతో పాటు 16 మంది పేర్ల జాబితాను ఆప్కాస్ డైరెక్టరేట్‌కు వెంటనే పంపించాలని విజ్ఞప్తి చేశారు. జిఒ 7 ప్రకారం కనీస విద్యార్హత, సీనియారిటీ ప్రాతిపదికన అర్హత కలిగిన ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలన్నారు. ఇంజనీరింగ్ విభాగంలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరికీ రూ.6 వేలు హెల్త్ అలవెన్సులు, రిస్క్ అలవెన్సులు చెల్లించాలని పేర్కొన్నారు. పనిముట్లు, రక్షణ పరికరాలు ఇప్పించాలన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరికి ఇళ్ళ స్థలాలు, ఇళ్ళు కట్టించి ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీలో పని చేస్తూ చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని, 60 సంవత్సరాలు పూర్తయ్యి, రిటైర్డు అయిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. మున్సిపల్ స్కూల్లో పని చేసే స్కూల్ స్వీపర్లకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు రామకృష్ణ, ఆదాము, బిబిలతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

కమిషనర్ నిరంజన్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొత్తగా 5 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో లో-వోల్టేజీ సమస్య నివారించుటకు విద్యుత్ శాఖ అధికారులు సుమారు 31 లక్షల రూపాయలతో కొత్తగా 5 ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఎండిఓ కార్యాలయం సమీపంలో, కూరగాయల మార్కెట్, నాగుల కట్ట, గర్ల్స్ హైస్కూలు, కోవెలకుంట్ల రోడ్డులో ఈ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ డిఈఈ రవికాంత్ చౌదరి మాట్లాడుతూ విద్యుత్ సబ్ డివిజన్‌లోని వినియోగదారులు బిల్లులు సకాలంలో చెల్లించి తమకు సహకరించాలన్నారు. కరెంటు బిల్లు ఇచ్చిన రోజు నుంచి 14 రోజులలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ హుస్సేన్ భాష, లైన్స్పెక్టర్ రమణయ్య, అమీర్ భాష, ఫోర్ మెన్ ప్రతాప్, లైన్మెన్లు నాగరాజు, ఖలీల్, సుబ్బారావు, నజీర్, కాంట్రాక్టర్ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అల్ట్రాటెక్ సిబ్బంది గోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అంకిరెడ్డి పల్లె, పెట్టి కోట, కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ వారి ఆధ్వర్యంలో కళాబృందంచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అల్ట్రాటెక్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - అవుకు

ఆయుష్మాన్ భారత్ కార్డ్స్, కుల గణన, జగనన్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ వివరాలను ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో పూర్తి చేసి లక్ష్యాలను అధిగమించాలని ఎంపిడిఒ మల్‌రెడ్డి తెలిపారు. అవుకు మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో ఉన్న సచివాలయాన్ని ఎంపీడీవో మల్రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ ఉద్యోగుల పనితీరును హాజరు పట్టిని తనిఖీ చేసి ఉద్యోగులకు తగిన సూచనలను అందించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేసి ప్రజలకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు చేయాలని సచివాలయ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాజకీయం వ్యాపారం కాకూడదు.. సేవ కావాలి

- కాంగ్రెస్ నుండి నంద్యాల అసెంబ్లీ బరిలో పోటీకి సిద్ధం
- గోళ్ల రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాజకీయం అనేది వ్యాపారం కాకూడదన, సేవ కావాలని సామాజిక సేవకుడు, కాంగ్రెస్ పార్టీ నుండి నంద్యాల అసెంబ్లీ సీటు ఆశిస్తున్న గోళ్ల రాజేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం నంద్యాలలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఓ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను త్వరలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేయనున్నట్లు ప్రకటించారు. నంద్యాలలో చెత్త, చెదారం పేరుకుపోతుందన, డ్రైనేజీ వ్యవస్థ అస్థ వ్యస్తంగా తయారైం దన్నారు. ఇంత పెద్ద పాలన యంత్రాంగం ఉన్న నంద్యాల పట్టణంలో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఒక్కప్పుడు కుక్కలు, పందుల బెడద అని చెప్పుకునే వాళ్లమన, ఇప్పుడు దోమల గురించి చర్చించుకోవాల్సిన పరిస్థితి రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. 1998 నుండి కాంగ్రెస్ పార్టీలో ఉన్నామని, అనేక సేవ కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. వైసిపి, టిడిపి నాయకులకు టికెట్లపై ఉన్న శ్రద్ధ పట్టణ సమస్యలపై లేదన్నారు. కాంగ్రెస్ అధిష్టానం నంద్యాల అసెంబ్లీ సీటు తనకు కేటాయిస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కరోనా సమయంలో ఏ రాజకీయ నాయకుడు చేయని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక సేవ కార్యక్రమాలు చేశానని, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, ఆత్మకూరు చెంచు గూడెలలోనూ సేవ కార్యక్రమాలు చేపట్టడంతోపాటు, ప్రజలకు అందుబాటులో ఉన్నానని చెప్పారు. త్వరలోనే పట్టణంలోని చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, రజకులకు ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

గోళ్ల రాజేంద్ర ప్రసాద్

ఒపిఎస్ అమలు చేసే వారికే మా ఓటు : యుటిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె

ఏ పార్టీ అయితే ఒపిఎస్‌ను ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి అమలు చేస్తారో వారికే తమ, తమ కుటుంబ సభ్యుల ఓట్లు వేస్తామని యుటిఎఫ్ జిల్లా సహా అధ్యక్షులు సత్య ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మండల అధ్యక్షులు ఎన్.ప్రతాప్ ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధన కోసం పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయులు పోస్ట్ కార్డులను పోస్ట్ ఆఫీస్ సమీపంలోని పోస్ట్ డబ్బాలో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ ఫర్ ఒపిఎస్ కార్యాచరణలో భాగంగా ఉద్యోగ ఉపాధ్యాయులందరూ పాత పెన్షన్ సాధించుటకు ఏప్రిల్‌లో జరగబోయే ఒపిఎస్‌ను మేనిఫెస్టోలో పెట్టిన పార్టీకే తమ ఓటు వేస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో సిపిఎస్‌ను వారం రోజుల్లో రద్దు చేస్తానని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అవగాహన లేక మాట్లాడానని అనడం తగదన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు సుధాకర్, ఆర్థిక కార్యదర్శి విజయ్ కుమార్, సహాధ్యక్షులు కృష్ణయ్య, జిల్లా కౌన్సిలర్లు సతీష్, పూజారి శ్రీనివాసులు, గోపాల్, ఏసిహెచ్ సన్నన్న, సుధాకర్, అవుకు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున, లక్ష్మీ నాయక్ పాల్గొన్నారు.

పోస్ట్ డబ్బాలో కార్డులు వేస్తున్న ఉపాధ్యాయులు

మహానందిలో సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్

ప్రజాశక్తి - మహానంది.

మహానంది క్షేత్రంలో వెలసిన కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామి వార్లను ప్రముఖ కవి, సినీగేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం మౌనశ్రీ మల్లిక్, స్వప్న దంపతులను వేద పండితులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, వేద ఆశీర్వాదం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను టెలివిజన్ సీరియళ్లకు, సినిమాలకు కలిపి వేయి పాటలు పైగా రాశానని పేర్కొన్నారు. ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, సంగీత దర్శకులు కీరవాణి, కోటి వంటి ప్రముఖులతో పని చేశానని తెలిపారు. తనకు వీలు చిక్కిన ప్రతిసారి ఈ క్షేత్రాన్ని సందర్శిస్తానని చెప్పారు. ఇది యోగులు నడయాడిన భూమి అన్నారు. మౌనశ్రీ మల్లిక్‌తో పాటు వచ్చిన మరో సినీ, టీవీ రచయిత సాహిత్యప్రకాశ్ మాట్లాడుతూ తాను నంద్యాల జిల్లా వాస్తవ్యుడనని, తన ఇష్ట దైవం మహానందీశ్వరుడని తెలిపారు.

మహానంది దేవస్థానంలో మౌనశ్రీ మల్లిక్ దంపతులు

ఓటర్లకు అందుబాటులో ఉండాలి : టిడిపి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఓటర్లకు తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ అందుబాటులో ఉండాలని టిడిపి నంద్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎన్ఎండి ఫరూక్, జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్‌లు తెలిపారు. మంగళవారం నంద్యాలలోని టిడిపి జిల్లా కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి.ఫరూక్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బూత్ కన్వీనర్లు కొత్తగా వచ్చిన ఓటర్ల జాబితా క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి ఓటరును గుర్తించి వారికి అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ టిడిపి సానుభూతి పరుల ఓట్లు ఎప్పటికప్పుడు చెక్ చేస్తుండాలని, బూతుల వారీగా ఓటర్లను గుర్తించి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ ద్వారా అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చే సంక్షేమ పథకాలు వివరించాల్సిన బాధ్యత బూత్ కన్వీనర్లకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిల్లెల శ్రీరాములు, కౌన్సిలర్ జైనాబ్ బీ, మాజీ కౌన్సిలర్లు కృపాకర్, శివశంకర్, కరిముల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్

అల్లాబకాష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పస్తున్న దశ్యం

రంగస్థల కళామూర్తి అల్లాబకాష్

- చిత్రపటానికి కళాకారులు నివాళి

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని భగత్ సింగ్ గ్రంథాలయంలో ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో కళాకారులు మంగళవారం ప్రముఖ రంగస్థల కళాకారుడు లొద్దిపల్లె అల్లా బకాష్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మురసం జిల్లా అధ్యక్షుడు యంఎండి రఫీ మాట్లాడుతూ ఐదు దశాబ్దాలు రంగస్థలం సేవలో రాయలసీమ రత్నంగా బాసిల్లిన కళామూర్తి అల్లా బకష్ అని కొనియాడారు. జిల్లా కార్యదర్శి మాబుబాషా మాట్లాడుతూ వారి పూర్వీకులు కళారూపాల పట్ల ఆకర్షితులై వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైనా ప్రవృత్తి కళాకారునిగా రాష్ట్రస్థాయిలో ప్రశంసలు అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రశంసించారు. అరసం జిల్లా అధ్యక్షుడు ముర్తుజా మాట్లాడుతూ ఆంధ్ర నాటక రంగానికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా 2008లో నందమూరి తారక రామారావు రంగస్థలం పురస్కారం తోపాటు అనేక పురస్కారాలు అందుకున్న మేటి నటుడని అభినందించారు. ప్రముఖ న్యాయవాది శంకరయ్య మాట్లాడుతూ ఆంధ్ర నాటక కళ సమితిని స్థాపించి నాటకాన్ని ఒక ఉద్యమంగా నడిపారని తెలిపారు. అల్లాబకాష్ కుమారుడు మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా ఉండి నాటకాల పట్ల ఆకర్షితులై రాష్ట్రస్థాయిలో అనేక బహుమతులు అందుకోవడం తమ కుటుంబానికి ఎంతో గర్వకారణమన్నారు. కళాకారులు బాల ఉసేన్, శివరామిరెడ్డి, ప్రసాద్, రాజగోపాల్ రెడ్డి, బికే రాముడు, నరసింహులు, నాగశేషుడు, బివై రమణ, గోకారి తదితరులు అల్లా బకాష్ పాడిన పౌరాణిక పద్యాలు పాడి అందరినీ అలరించారు.

పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి : కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్, ఫరూఖ్ నగర్ వార్డులలో శానిటేషన్ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. పారిశుధ్య పనుల్లో అలసత్వం లేకుండా విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి
www.prajasakti.com

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - కొత్తపల్లి

పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికారులందరూ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీఓ దాస్ సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల సమయం ఆసన్నమైందన్నారు. అధికారులు ఎన్నికల విధులకు సిద్ధంగా ఉండాలన్నారు. మండలంలో 37 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయ న్నారు. వీటిలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని పోలీంగ్ కేంద్రాలలో అన్ని మౌళిక వసతులు ఉండేలా చూడాలన్నారు. అనంతరం జగనన్న ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. మండలంలో సాంకేతిక లోపాల కారణంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగడంలేదని సిబ్బంది సూచించడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్నలు ఉన్నారు.

రూ.1.20 కోట్లతో డ్రైనేజి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - చాగలమర్రి

పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

చాగలమర్రి పట్టణంలోని బిసి బాలికల వసతి గృహం నుంచి చాగలమర్రి ఆలయం సమీపంలోని బుగ్గ వంక వరకు రూ 1.20 కోట్లతో చేపట్టనున్న డ్రేనేజీ నిర్మాణానికి సర్పంచ్ తులసమ్మ, ఎంపిపి వీరభద్రుడు,వార్డు సభ్యురాలు జ్యోతి,జేసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ బాబూలాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డిలు మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజ్ సమస్యను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళగా ఉపాధి హామి నిధులు 1.20 కోట్లు మంజూరు చేయించారన్నారు .ఈ నిధులతో డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య,ఇన్‌చార్జి ఈఓ నాగమణి,కాంట్రాక్టర్ నజీర్,హెచ్‌ఎం కోటయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ జాబీర్,వైసీపీ నాయకులు ఖాధర్‌బాష, బబ్లూ, మాబుసున్న,పెయింటర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ పరీక్షలపై భయం వీడాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - ఆత్మకూర్

మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు దినేష్

ఆత్మకూర్ పట్టణంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై భయం వీడాలని థెరిసా జూనియర్ కళాశాల అకాడమిక్ డైరెక్టర్ సాయి ప్రణీత్, శ్రీ ఆదిత్య కళాశాల కరస్పాండెంట్ విజయ్ భాస్కర్ నాయుడు, ఎస్‌ఎఫ్‌ఐ నంద్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ కే దినేష్ కుమార్‌లు అన్నారు. మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞ వికాస నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల టైంలో విద్యార్థులు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకో వాలని తెలిపారు. అదేవిధంగా పరీక్షలపై భయం వీడి ధైర్యంగా సబ్జెక్టు వారీగా విద్యార్థులు నిర్ణయించుకొని చదవాలని వారు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులపై ఈ కొంత సమయంలో వారి పిల్లలపై దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు ధైర్యంగా చదువుకొని ప్రతి ఒక్కరు సకాలంలో పబ్లిక్ పరీక్షలకు హాజరుకావాలని వారు తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జరిగినప్రజ్ఞ వికాస పరీక్షలో దాదాపు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు పి ప్రేమ్ కుమార్, నాయకులు సాయి, సలీం, రవి, వెంకటేష్, ధనుష్, దిలీప్, లింగేష్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టిడిపిదే అధికారం

భూమా అఖిలప్రియ

టిడిపిలో చేరిన ఎస్సీ కాలనీ వాసులతో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ.

ప్రజాశక్తి - రుద్రవరం

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీదే అధికారమని, త్వరలో మంచి రోజులు రాబోతున్నాయని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం రుద్రవరంలో మూడవరోజు ఆమె బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీకి చెందిన గోసమని చంటి, రాజకుమార్, ఆనంద్, ఎల్లాల్ విక్రం, వినోద్, అభిషేక్, జైపాల్, క్రిస్టఫర్ తో పాటు మరో 10 కుటుంబాలు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి పట్ల వ్యతిరేకత చూపిస్తూ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలుపుతున్నారని అన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని అరాచకాలు, అన్యాయాలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా ధైర్యంగా ముందుకు వచ్చి రుద్రవరం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన 20 కుటుంబాల వారు పార్టీలో చేరారని చెప్పారు. వైసిపి నాయకులు ఓట్లు వేయించుకుని కాలనీలో సమస్యలు పరిష్కరించలేదని, దీంతో పార్టీ మారుతున్నట్లు వారు తెలిపారని ఆమె అన్నారు. ఎస్సీ కాలనీలో సమస్యలు పరిష్కరించి అభివృద్ధి చేసేందుకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికలలో తనను గెలిపించి, టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని టిడిపి శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు లింగం వెంకట రంగనాయకులు శెట్టి, పోలా గురుమూర్తి, బాచేపల్లి నారాయణ, కొమ్మలపాటి రాజారావు, అల్లడి చంద్రశేఖర్, మజ్జిగ చంద్ర, దస్తగిరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

డోన్ : వైసిపి ప్రభుత్వం నవరత్నాల పేరుతో రాష్ట్ర ప్రజలను నవమోసాలు చేసిందని డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం డోన్ పట్టణంలో 7వ వార్డు పాతపేట నందు బాబు షఉరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బా రెడ్డి హాజరయ్యారు. అనంతరం ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ భవిష్యత్తుకు గ్యారంటీ మీనీ మ్యానిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశంపార్టీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు,నంద్యాల జిల్లా టిడిపి కార్యదర్శి అబ్బిరెడ్డిపల్లె గోవిందు,డోన్ పట్టణ టిడిపి సమన్వయ కమిటీ చైర్మన్ అలా మల్లిఖార్జున రెడ్డి,డోన్ పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు మద్రి ఉపేంద్ర,డోన్ పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ,డోన్ మండలం టిడిపి ప్రధాన కార్యదర్శి ఎల్‌ఐసి శ్రీరాములు,డోన్ మండలం టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు చక్రపాణి గౌడ్,డోన్ పట్టణ టిడిపి తెలుగుయువత ప్రధాన కార్యదర్శి సిటీకేబుల్ కిరణ్,వార్డు నాయకులు ఐటిడిపి ప్రసాద్,ఐ.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను అందజేస్తున్న మన్నే సుబ్బారెడ్డి

విద్యకు ప్రభుత్వం పెద్దపీట

- డాక్టర్ ధార సుధీర్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

రాష్ట్రంలో విద్యా వ్యవస్థకు వైసిపి ప్రభుత్వం పెద్దపీట్ట వేసిందని వైసిపి నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధార సుధీర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అల్వాల సత్రం నందు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జగనన్న కాలేజ్ కెప్టెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ దారా సుధీర్, రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు పానుగంటి చైతన్య నంద్యాల జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు సురేష్ యాదవ్, రాష్ట్ర విద్యార్థి విభాగం జనరల్ సెక్రెటరీ మాధురి గౌడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దార సుధీర్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి వంటి పథకాల ద్వారా జగనన్న ప్రభుత్వంలో విద్యా వ్యవస్థకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అనంతరం రాష్ట్రంలో జగన్ చేసిన అభివృద్ధిని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పగిడ్యాల మాజీ మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రమేష్ నాయుడు, ఉమ్మడి జిల్లాల మైనారిటీ జోనల్ ఇంచార్జ్ అబూబక్కర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు జబ్బార్, జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబర్ ఉస్మాన్ బేగ్, పట్టణ యూత్ వింగ్ ప్రెసిడెంట్ లడ్డూ, పగిడ్యాల సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, వైసిపి నాయకులు దేశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాలేజ్ కెప్టెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ దార సుధీర్

దరఖాస్తును అందజేస్తున్న నాగలింగం

నందికొట్కూరు అసెంబ్లీ బరిలో నాగలింగం

ప్రజాశక్తి - నందికొట్కూరు

కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు మిద్దెల నాగలింగం మంగళవారం విజయవాడ ఆంధ్ర రత్న భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు తాంతియా కుమారి, మాజీ స్టేట్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కొరివి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బందికి దర ఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ ఏ రమేష్ బాబు, జనరల్ సెక్రెటరీ జి సురేష్ బాబు, కార్యకర్తల అయ్యన్న, లక్ష్మన్న, మధు, యేసు రత్నం పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మె

- జయప్రదం చేయండి : లారీ మోటర్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - బేతంచెర్ల

మాట్లాడుతున్న లారీ మోటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు

డ్రైవర్లను జైలుపాలు చేసే హిట్ అండ్ రన్ చట్టాల రద్దుకై ఈనెల 16న దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయలని బేతంచర్ల ట్రాన్స్పోర్ట్ రంగం రాష్ట్ర కమిటీ సభ్యుడు వైబి. వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్ల య్యలు బేతంచర్ల లారీ స్టాండ్ నందు నందు కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి చట్టాలు ఇప్పటికీ అమలు అవుతున్నందున ప్రమాదం చేసిన డ్రైవర్లకు శిక్ష పడిన వెంటనే బయటకు వస్తారని ఇది సరికాదనిఈ చట్టాలను తక్షణమే మార్చాలన్నారు. కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం గత డిసెంబర్ 21న 2023 తేదీన భారత న్యాయ సంహిత పేరుతో కొత్త చట్టాన్ని పార్లమెంట్లో ఆమోదింప చేసుకొని రాష్ట్రపతి ఆమోదం పొంది సెక్షన్ 106 /1 ప్రకారం ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌కు 10 సంవత్సరాలు జైలు శిక్ష ఐదు లక్షల రూపాయల్లో జరిమానా కట్టాలని 106/2 ప్రకారం ప్రమాదం చేసిన డ్రైవరు అక్కడి నుండి వెళ్లినట్ల యితే హిట్ రన్ పేరుతో 10 సంవత్సరాలు జైలు శిక్ష పది లక్షల రూపాయలు జరిమానా విధించే విధంగా ఈ దుర్మార్గమైన చట్టాన్ని రూపొం దించారన్నారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ డ్రైవర్లు మెరుపు సమ్మె చేయడం వల్ల తాత్కాలికంగా ఈ చట్టాన్ని ఆపడం జరిగినా.. రద్దు చేయలేదన్నారు. ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించు కోకుండా ప్రమాదాలు కేవలం డ్రైవర్ల వల్లనే జరుగుతున్నాయని నెపంతో డ్రైవర్లపై ఇలాంటి భారీ శిక్షలు జరినామాలు విధించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బేతంచర్ల లారీ యూనియన్, నాయకులు జై. శ్రీనివాసులు, బి. రామాంజనేయులు, రమణారెడ్డి, సురేష్, రాజు, కలాం, మధు, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ నాయక్, ఎర్రన్న నాయక్, ఆటో యూనియన్ నాయకులు ఏ. మదిలేటి స్వామి, తిరుమలేశు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, ALLAGADDA

IA.NO. 8/2020 IN O.S. No. 107/2018

Challa Venkata Narayana Reddy Died By Lrs Challa Subba Lakshamma and others ...PLAINTIFFS

-VS-

Kasiraju Srinivasa Raju. ...DEFENDANT

NOTICE TO THE DEFENDANT

Kasiraju Srinivasa Raju,
S/o Ranga Raju,
R/o Raja Nagaram-village,
Sirivel-Mandal.
Nandyal-Dist.

Whereas the above named IA.NO. 8/2020 petition filed by the petitioners against you for adding of legal heirs of deceased plaintiff Challa Venkata Narayana Reddy, you are hereby required to appear in the Court on the 14.02.2024 in Person or by pleader duly instructed and able to answer all the materials questions related to the above proceedings. ALSO take notice in default of your appearance on the aforesaid day. The issue will be settled and the petition heard and determined in your absence. You shall also bring will you or send by your pleader and document which the petitioner desires to inspect and any document on which you intent to rely in support of your defence.

By order of the court
C.V.RAMANA RAO
ADVOCATE FOR PLAINTIFF

శతాధిక వృద్ధుడు మహమ్మద్ హుస్సేన్ (104) మృతి

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఎం హుస్సేన్ ఫైల్ ఫోటో

బేతంచెర్ల పట్టణం బయటిపేట కాలనీకి చెందిన శతాధిక వృద్ధుడు పిట్టల పి రామ్ సాహెబ్ గారి మహమ్మద్ హుస్సేన్ (104) అతి వృద్ధాప్యంలో మంగళవారం నాడు తెల్లవారుజామున సహజ మరణం పొందారు. ఆయన మృతికి బేతంచెర్ల పట్టణం, ఆయా గ్రామాల ముస్లిం సహోదరులు సహో దరీలు మహ్మద్ హుస్సేన్ కణానికి సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యుల బంధువుల వివరాల మేరకు మహమ్మద్ హుస్సేన్ గత సంవత్సరం వరకు తమ సొంత వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడని వారు తెలిపారు. మహమ్మద్ హుస్సేన్ కుటుంబ సభ్యులకు పలువురు సంతాపం తెలిపారు.

'ఉద్యోగులు అందుబాటులో ఉండాలి'

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని సచివాలయ ఉద్యోగులు కార్యాలయ సమయాలలో అందుబాటులో ఉండాలని కుల గణన పకడ్బందీగా నిర్వహించాలని, పట్టాల రిజిస్ట్రేషన్ తొలిచేయాలని ఎంపీడీవో విజయరావు కోరారు. మంగళవారం మండలంలోని ఈర్నపాడు సింగవరం గ్రామాల సచివాలయాలను ఆకస్మికం గా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు హక్కు సుజాతలతో మాట్లాడి కార్యాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సజ్వాల సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలను కలిసిన సుధీర్ ధార

ప్రజాశక్తి - పగిడ్యాల

నందికొట్కూరు వైఎస్ఆర్‌సిపి ఇన్చార్జి డాక్టర్ సుధీర్ ధార పగిడ్యాల, లక్ష్మాపురం గ్రామాలలో మంగళవారం పర్యటించి వైసిపి నాయకులను కార్యకర్తలను కలిశారు. పగిడ్యాల, లక్ష్మాపురం గ్రామంలో చేరగానే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రామాలలోని వైసీపీ నాయకులను, కార్యకర్తలను ఆయన కలిసి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. పగిడ్యాల గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, మాజీ జెడ్పిటిసి వైసీపీ మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వైసిపి నాయకులు కాటం రమేష్ రెడ్డి, మండ్ల మురళి, సుధాకర్, సత్యనారాయణ రెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైటప్. వైయస్సార్ విగ్రహానికి పూలమాలవసి నివాళు లర్పించిన వైసీపీ ఇన్ఛార్జి సుధీర్

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ప్యాపిలి

సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులకు వివరణ ఇస్తున్న ఏ ఓ రాజేష్

మండల కేంద్రమైన ప్యాపిలి స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు మంగళవారం ఎంపీడీవో సాయి మనోహర్ ఆధ్వర్యంలో మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ గోకుల్ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథులుగా జెడ్పిటిసి శ్రీరాంరెడ్డి, మాజీ జెడ్పిటిసి దిలీప్ చక్ర వర్తి, తాసిల్దార్ ప్రతాపరెడ్డి, వైస్ చైర్మన్ రాజా రూపారాణి అధ్యక్షులు గోగులక్ష్మీ మాట్లాడారు. గత సమావేశం నుండి నేటి వరకు మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ముందుగా మండల వ్యవసాయ అధికారి రాజేష్ వివరించారు. ప్యాపిలి, డోన్ మండలాలను రెండవ విడతలో కరువు మండలా లుగా ప్రకటించే అవకాశం ఉందన్నారు. గ్రామాలలో భూగర్భ జలాలు తక్కువయ్యాయని కావున రాబోవు వేసవికాలంలో మండలంలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రజా ప్రతినిధులను కోరారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ వాణిశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమమును ప్రజలు సద్వినియోగపరచుకోవాలన్నారు. మండల విద్యాధికారికి ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాలు 100% వచ్చేలా చూడాలని ప్రజాప్రతినిధులు సూచించారు. మండలంలోని దాదాపు బీటీ రోడ్లు వంద శాతం వరకు పూర్తయ్యాయని పిఆర్ఏఈ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ నెంబర్ రసూల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీ రూ. 600 ఇవ్వాలి : వ్యకాసం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ. 600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్ద మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యకాసం మండల అధ్యక్షుడు సుబ్బరాయుడు, మండల కార్యదర్శి డేవిడ్ మాట్లాడారు. ఉపాధి కూలీలకు భద్రత కల్పించాలని, దినసరి వేతనం రూ. 600 చెల్లించాలని, వేసవికాలంలో అలవెన్స్ ఇవ్వాలని, ఫేస్ యాప్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. వారం వారం వేతనాలు చెల్లించాలని, గతంలో పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

8న చలో విజయవాడ

5వ పేజీ తరువాయి.. సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలి, రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ఈనెల 8వ తేదిన నిర్వహించే చలో విజయవాడకు ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు స్వాములు, రవీంద్ర, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ గంగాధర్‌కు ఆశా వర్కర్లు, సిఐటియు నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు నరసింహ, ఆశ వర్కర్ల నాయ కులు భారతి, రసూల్ బి. మాట్లాడారు. **బేతంచెర్ల :** ఆర్.ఎస్.రంగాపురం గ్రామంలో డాక్టర్ సలీమ్‌కి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సిఐటియు మండల కార్యదర్శి ఎస్ రహమతుల్లా, ఆశ వర్కర్ల యూనియన్ మండల కార్యదర్శి ఆర్ వెంకటలక్ష్మి తదితరులు అందజేశారు. **ప్యాపిలి :** చలో విజయవాడ కార్య క్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం, డోన్ మండల అధ్యక్షులు పి.రామాంజనేయులు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు భాగ్యమ్మ, కృష్ణవేణి, చౌడేశ్వరి తదితరులు జలదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్వైజర్లు దీవనమ్మ, వెంకటేశ్వర్లకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు పీరాంబి, శాంతకుమారి, సునీత, రేణుక, దేవమ్మ, కృష్ణవేణి,పుల్లమ్మ తదితర ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నందికొట్కూరు టౌన్ : వినతి పత్రం ఇస్తున్న ఆశాలు

బేతంచెర్ల : డాక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆశాలు

ప్యాపిలి : వినతి పత్రం ఇస్తున్న ఆశాలు

ఆలయ అంగళ్ల వేలం

ప్రజాశక్తి - గడివేముల

మండలంలో దక్షిణ కాశీగా పేరుందిన శ్రీ దుర్గా భోగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా తాత్కాలిక అంగళ్ళ వేలంలో భోగేశ్వర ఆలయానికి రూ.26,000 ఆదాయం పెరిగినట్లు ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు అంగళ్ళ వేలం నిర్వహించగా గత సంవత్సరం మూడు లక్షల ఏడు వేలు రాగా ఈ సంవత్సరం మూడు లక్షల 30 వేల రూపాయలు వచ్చాయని అందువల్ల గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 26 వేల రూపాయల ఆదాయం పెరిగినట్లు ఆయన తెలిపారు. ఆలయ చైర్మన్ సునీల్ కుమార్ రెడ్డి, ధర్మకర్త మండలి పరమేశ్వర్ రెడ్డి, సురేంద్ర నాథ్ రెడ్డి, శ్రీనివాసులు కుమారి ప్రజలు పాల్గొన్నారు.

వేలంపాట నిర్వహిస్తున్న ఆలయం అధికారులు చైర్మన్

మాట్లాడుతున్న సప్తశైల సుమిత్రరాజేష్

మహిళలకు చాక్లెట్ల తయారీ శిక్షణ

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని బుగ్గన శేషారెడ్డి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నందు డాక్టర్ వైయస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ సప్తశైల సుమిత్ర రాజేష్ ఆధ్వర్యంలో 100 మంది మహిళలకు ఫ్రూట్స్‌తో చాక్లెట్ల తయారీ శిక్షణను మంగళవారం ఉచితంగా నేర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వైయస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ సప్తశైల సుమిత్రరాజేష్ మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో నిరుద్యోగ యువతుల కోసం శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ సైంటిస్ట్ డాక్టర్ విజయశ్రీ, కౌన్సిలర్ మేకల విమల,ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ శాలిని ప్రకాష్,రాజా సుజాత,శైలజ,శారద,మద్దమ్మ,శకుంతల తదితరులు పాల్గొన్నారు.

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

పశుగ్రాసం దగ్ధం

- రైతుకు రూ.లక్ష నష్టం

- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి

ప్రజాశక్తి - పగిడ్యాల

పశుగ్రాసం నిప్పంటుకొని దగ్ధమైన రూ. 1 లక్ష నష్టం వాటిల్లిన ఘటన మండల కేంద్రం పగిడ్యాలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలకు ఇలా ఉన్నాయి. పగిడ్యాల గ్రామం దేవ నగర్ దళిత కాలనీకి చెందిన మద్దూరు బుజ్జి అనే రైతు తన కళ్ళంలో పశుగ్రాసం వామిని వేసుకున్నాడు. మంగళవారం ఉన్నట్టుండి మంటలు ఎగిసిపడడంతో స్థానికులు అగ్నిమాప కేంద్రానికి సమాచారం అందించారు. తక్షణమే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేసి ప్రమాదాన్ని జరగకుండా ఆపేశారు. పశుగ్రాసం దగ్ధం కావడంతో రూ1 లక్ష నష్టం వాటిలిందని రైతు బుజ్జి ఆవేదన వ్యక్తం చెందారు. రైతు మద్దూరు బుజ్జికి మొత్తం స్పందించి నష్టపరిహారం అందించాలని స్థానికులు కోరారు.

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల

O.S. NO.267/2021

గంగవరం నారాయణరెడ్డి. ...వాది

వర్సెస్

వడిశేలగారి తులిశన్న died by his L.Rs.
1.వడిశేలగారి తొలిశమ్మ & వగైరాలు. ...ప్రతివాదులు
D4. వడిశేల ఈశ్వరమ్మ వయసు సుమారు 40 సం.
భర్త లేటు వెంకట లింగం, హిందూ, వ్యవసాయం,
చాబోలు గ్రామం, నంద్యాల మండలం, నంద్యాల జిల్లా
(ఇంతకుముందు కర్నూలు జిల్లా)

4 వ ప్రతివాది కి దావా సమన్లు

పై దావా నందు వాది, ప్రతివాదుల పై దావా దాఖలుచేసి ఉండి ప్రామిసర్ నోటు డబ్బులు మొత్తం 93,900/- రాగోరి 4వ ప్రతిపాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారు ఉత్తర్వుల మేరకు తేదీ.29-02-2024 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరపు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పరోక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ. 29-02-2024

ఇట్లు
K. రామకృష్ణయ్య
వాది పరం అడ్వకేట్
నంద్యాల.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు: నంద్యాల

E.P.No.86/2023 in O.S.No. 22/2020

రూకా చిన్న ఓబులరెడ్డి. ...DHr/Plaintiff

Vs

బొగ్గరపు ఫణి కుమార్, వ్యాపారము,
తండ్రి బొగ్గరపు సుబ్రమణ్యం, H.No.16/53, శాంతి ఆప్టికల్, బసవన్న గుడి పక్కన, బైరమల్ వీధి,
మరియు H.No. 23-155-B, కోటా వీధి,
నంద్యాల పట్టణం & జిల్లా. ...JDr/Defendant

ORDER 21 RULE 54 కింద JDr కి నోటీసు

పై దావ యందు Dhr/Plaintiff అనువారు JDr/Defendant పై, పై కోర్టులో సివిల్ దావా యందు 30.09.2021 వ తేదీన ఆదేశించిన తీర్పు మేరకు, పై తెలిపిన DHr/Plaintiff కు మీరు చెల్లించవలసిన తీర్పు మొత్తము, వడ్డీ మీరు కట్టనందున, సదరు తీర్పు అమలు కోరుతూ, పైన తెలిపిన E.P. నీ DHr/Plaintiff దాఖలు చేసి ఉన్నారు. సదరు E.P. నందు అనేక మార్లు మీకు ఆర్డర్ 21 rule 54 నోటీసులు మీకు అనేక మార్లు పంపిననూ, మీరు తీసుకొనుటకు నిరాకరిస్తూ ఉండడం వల్ల, కోర్టు వారి ఉత్తర్వుల మేరకు పత్రికా ముఖముగా ఈ నోటీసును జారీ చేయడమైనది.కావున, పై దావ తెలిపిన అంశాల పైన మీకు ఏదైనా ఆక్షేపణలు ఉన్న ఎడల, 01.03.2024 వ తేదీన ఉదయం 10.30 AM కి పైన తెలిపిన కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ, మీ సూచనలు పొందిన న్యాయవాది ద్వారా కానీ, హాజరు అయి తెలుపుకోగలరు. అట్లు లేనంతట, పై అమలు దావాను మీ పరోక్షమందు కోర్టు వారు తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా: 01.03.2024

P.D.H.BABU
ADVOCATE
నంద్యాల.
Cell No. 9440024823